కథా నిలయం
4626
శ్రీకాకుళం

# మూడురాత్రుల ముచ్చట
## లేక గేమ్ ఆఫ్ లవ్

అది మొదటిరాత్రి
గదిలో అగరొత్తులు ఘాటుగా వెలుగుతున్నాయ్
తలపులు విచ్చుకుంటున్నాయ్
రెండు ప్రపంచాల సమీకరణ ఆరంభమౌతోంది
గది తలుపులు మూసుకున్నాయ్
ఇంకో రంగం తెరుచుకుంది
తలుపు ఇవతల నుంచుంది ఆమె
మొహంలో కోటి ఆశల చూపు ఉంచుకుంది
మంచంమీద కూర్చున్నాడు అతడు
బుసకొట్టేపాములాగ ఉన్నాడు
పెదవులదాకా వచ్చిన ఆమె నవ్వు అణిగింది
అతడి ఆకారం చూసి ఆపాదమస్తకం వణికింది
పిల్లి – ఎలుక, జాబిల్లి – వెన్నెల
ఏది నువ్వు? ఏది నేను?
తుమ్మెద – పువ్వు, పువ్వూ – పుప్పొడి
ఏమిటి మనమిద్దరం.
ఆమె అంతరంగంలో గోల
అతడి ముఖంలో అదొక హేల

రింగ్‌లో ఉరికే మాస్టర్‌లాగున్నాడు
ఆకలిగొన్న ఆర్తుడిలా ఉన్నాడు
దోవదొరికిన పాంథుడిలా నిలుచున్నాడు
ముందుకు అడుగేశాడు
రవిక మీద చేయివేశాడు
ఒక చూపు లేదు ఒక పిలుపు లేదు
ఒక ముద్దు లేదు ఒక మాట లేదు
పూలరాశిని ఎద్దు కుమ్మినట్టు....
కోటి ఆశల చూపు చితికిపోయింది
సంప్రదాయం మాత్రం మిగిలిపోయింది
అతడు హక్కుదారుడు, తను అబల
మనసు రాయి చేసుకుంది.
అతడి ఆజ్ఞానువర్తిని అయింది
కూచుంది నుంచుంది పడుకుంది
అతడు చిరునవ్వు విడిచాడు
ఆమె నిట్టూర్పు అణిచింది
అతడు గెలిచాను అనుకున్నాడు
నిద్రలో ఆదమరిచాడు
ఆటబొమ్మ నేను అనుకుంది. ఆమె
నిద్రకీ శాంతికీ దూరమైంది
పగలంతా ఒకరికి పండగలా గడిచింది
ఇంకొకరికి దిగులుగా నడిచింది
బ్రతుకే దండగ అనిపించింది.
సంప్రదాయపు పునాది కదిలించింది
అది రెండవ రాత్రి
అగరొత్తులూ మల్లెపూలు మామూలుగా ఉన్నాయ్
మనసులో చీకటి పరదాలు అల్లాడుతున్నాయ్
పరిచితంగా చేయి మీద పడింది
సంకెలలాగ స్పర్శ తోచింది
త్రికరణం తిరగబడింది

సంప్రదాయం శిధిలమైంది
నేను మనిషిని అంది ఆమె మనసు
వదలండి అంది ఆమె గొంతు
పట్టు సడలించుకుంది మేను
చీర సవరించుకుంది ఆమె
తెల్లబోయాడతడు వెంటనే
ఎగిరి పడ్డాడు వెను వెంటనే
ఆడదానివికాదా అని అడిగాడు
ఆక్రమింప జూశాడు
శిలలాగ చూసింది ఆమె
శాపగ్రస్తలాగ నవ్వింది
అతడికి అడుగు ముందుకి పడలేదు
జుట్టు పీక్కున్నాడు
పిడికిలి గుద్దుకున్నాడు
సిగరెట్ అంటించాడు
అవతలకి నడిచాడు
ఆమె కుప్పలా కూలిపోయింది
హిమవంతంలా కరిగిపోయింది
ఆట ఆఖరయింది అనుకుంది
పొరపాటా! అని పరితపించింది
పాపమా! అని బాధపడింది
ఒడ్డులేని సముద్రాలెన్నో ఈదింది
హతాసురాలైనది.
అశ్రుసిక్త అయింది.
అది ముచ్చటైన మూడవ రాత్రి
తలుపులు యధావిధిగా మూసుకున్నాయ్
ఎదురెదురుగా నిలబడ్డారు వధూవరులిద్దరూ
తరిగిన ఆశలు, కలవని ఊహలూ
కత్తుల రవ్వలు, కనపడని మంటలు
ఎందుకిక్కడ ఉన్నాను అనుకున్నాడతడు

ఈ బంధమెట్లా తెంచటం ఆలోచిస్తున్నాడు
బజారులో మిఠాయి గుర్తువస్తోంది
మెదడులో కాబరే ఆడుతోంది
వంశగౌరవం, సంఘభయం
కత్తులు దూస్తున్నాయతని మీద
మనసుకి పాశాలు తగిలిస్తున్నాయ్
అతడిని విషాదంలో ముంచుతున్నాయ్
తలుపు ఇవతల నిలబడిందామె
తన కళ్ళని తానే నమ్మలేకపోతోంది
అతడు మళ్ళీ గదిలోకి రాడనుకుంది
సుమతి చంద్రమతీ గుర్తు వచ్చారు
తనూ ఇంక వాళ్ళలాగే అనుకుంది
ఇతడు మగవాడేనా అని ఆశ్చర్యపడింది
మరలి వచ్చాడా అని జాలిపడింది
ఏది దారి అని మధనపడింది
మనసు పాతాళంలో ఒక మూల చెమర్చింది
మాతృత్వం చిగుళ్ళు తొడిగింది
స్నేహం లతలు వేసింది.
వలపు పూలు పూసింది.
ముందుకు అడుగు వేసింది.
చేతులు బార జాపింది
అతడి భుజాలు అందుకుంది
కనులలోకి చూసింది
దరహాసం చేసింది
దేహంలో దవాలనం ఉంటుందని తెలుసు అతడికి
చూపుల్లో దీపాలుంటాయా?
నవ్వులో పూల జల్లులుంటాయా?
స్పర్శలో తేనె వాకలుంటాయా?
అతడి జుట్టు సవరించింది
బుగ్గకి బుగ్గ ఆనించింది

అలుకా అని లాలించింది
స్వర్గంలో అడుగు పెట్టినట్టు కోటి పులకరింతలు
మానవత్వం తెలిసినట్లు వేయి దీపకాంతులు
పలుకులో ఇంతటి పరమార్థమా!
చూపుల కత్తులు ముడిచాడతడు
ఎవరినేనా ప్రేమించావా? అడగలేక అడిగాడు.
నిశితంగా చూసిందామె
కల కలా నవ్విందామె
''ఊ'' అంటూ తల ఊపింది.
''నిన్నే'' అంటూ గుండెమీద వాలింది.
దేవతలు కరుణించారనుకున్నాడు.
ఆ రాగాల వీణను గారంగా ఒడిలో చేర్చుకున్నాడు.
పౌరుషం ప్రదర్శిస్తూ ''ఇదే ప్రతీకారం'' అన్నాడు.
ఆమె అధరంమీద చిలకలు కిసకిస నవ్వాయి
చూపూ చూపూ కలిసి పునాది కుదిరింది
మనసూ మనసూ కలిసి మందిరం వెలసింది
మేనూ మేనూ కలసి జన్మలు తరించాయి
గెలుపూ ఓటమి లేని ఆట!
దాంపత్యం దివ్యంగా వెలిగింది

జయశ్రీ (సంక్రాంతి), 1977

* * * *